కథా నిలయం
5141
శ్రీకాకుళం

# "గూడు"




విపుల, జనవరి 2000

సూర్యుడింక ఆ రోజుకి ఏ దిగంతాలలోకో జారుకుంటున్న వేళ పక్షులు కోలాహలంగా గూళ్ళు చేరుకుంటున్నాయి. నక్షత్రాలు ఒక్కొక్కటిగా ఆకాశంలో దర్శనమిస్తున్నాయి.

కాళ్ళు నెప్పులు పుట్టేలా ఆవరణంతా తిరిగి తిరిగి లలిత చివరికి ఒక సిమెంటు బెంచీమీద కూలబడింది. ఒక భావన ఆమెని స్థిమితంగా వుండనివ్వటంలేదు. చిన్నప్పుడు తండ్రి ఆశ్రయంలో, పెళ్ళయ్యాక భర్త దగ్గరా, భర్త పోయాక కొడుకింట్లో, యిప్పుడీ సంధ్యారామంలో. ఎప్పుడూ పరాధీనతేనా? ఏ దేవుడు యీ దేశపు ఆడవాళ్ళ నుదుట యిలాంటి రాత రాశాడు?

"ఇక్కడున్నావా? నీ కోసం గదికి వెళ్ళి చూసి వచ్చాను" కమల తను కూడా వచ్చి ఆమె పక్కన కూర్చుంటూ అడిగింది.

ఆమెతో తన విషయాలేవీ చర్చించాలనిపించలేదు లలితకి. ఎందుకో... మరి!

"ఆకాశం చూడు, అప్పటిదాకా పిచ్చిపూలనీ, గులకరాళ్ళనీ అపురూపంగా వొళ్ళోదాచుకుని ఆడుకున్న అల్లరిపిల్ల ఆటలు చాలించి వాడి దులిపేసుకున్నట్టు నక్షత్రాలని ఎలా వెదజల్లుతోందో!" తన వుదాశీనతని గమనించకుండా వుండేందుకని అంది.

కమల నవ్వింది. "ఇంకా కవిత్వపు వాసనలు పోలేదే నీకు. ఇప్పుడంతా తీరికేకదా, రాయకూడదూ?" అనడిగింది.

"అంతా... తీరికే" అంది లలిత దీర్ఘంతీస్తూ ఆ అనటంలో విరుపుంది. ఆ విరుపులో దుఃఖం వుంది. నిరాశ వుంది. ఏదో కావాలన్న ఆర్తి వుంది.

ఆద్యంతాలు లేని సృష్టిలో అనంతమైన ప్రయాణం. ప్రతి పుట్టుకకీ గమ్యం మరణం. గమ్యం చేరేలోగా విసుగుపుట్టకుండా రాగద్వేషాలు, మమతానురాగాల కాలక్షేపాలు.

వంటరిగా లోకంలోకి వచ్చి మళ్ళీ అలాగే తిరిగి వెళ్ళటంలోనే చావుపుట్టుకల సూక్ష్మధర్మం యిమిడివున్నా, అది అందరికీ తెలిసిందే అయినా, దాని వాస్తవికతని గుర్తించలేనంతగా మనసుని కప్పేసి వుంచే అవాస్తవిక విలువలు! మనసుని ఛిద్రం చేసేవీ, దాన్ని తులాదండంగా నిలబెట్టి అనురక్తి విరక్తులని త్రాసుపళ్ళాలుగా వేలాడదీసేవీ అవే!

"ఎదురుగా నేనున్నా ఏమిటంత పరధ్యాస?" అడిగింది కమల.

"ఆలోచిస్తున్నాను"

"దేని గురించి?"

"ఓ తండ్రికి కూతురిగా, యిద్దరన్నదమ్ములకి తోబుట్టువుగా పుట్టి, అత్తిల్లుమెట్టి, అత్త మామలు, మరుదులు, ఆడబడుచుల్తో మమేకమై... నేనో నలుగురు పిల్లల తల్లినై వుండి కూడా ఎవరికీ ఏమీకాకుండా వుండిపోవడాన్ని గురించి" అంది లలిత.

అలా అంటుంటే ఆమె గొంతు వణికింది. కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. పమిటకొంగుతో అద్దుకుంది. ఏదైతే కమలముందు బైటపడకూడదనుకుందో అది అననే అనేసింది. మనసెప్పుడూ అంతే! వైరుధ్యంలో పడి కొట్టుకుంటూ వుంటుంది.

"బాధ పడ్తావని యింకా అడగలేదు. అంతమందీ వుండి, నువ్వొచ్చి యిక్కడుండటమేమిటి?" అడగలేక అడిగింది కమల.

ఇద్దరూ యింటర్ దాకా కలిసి చదువుకున్నారు. చదువవ్వగానే లలితకి పెళ్ళైపోయింది. సంసారబాధ్యతలు వెల్లువలా మీద పడి ఆమెని ముంచెత్తాయి. కమల యింటరవ్వగానే వుద్యోగంలో చేరింది. ఆ తర్వాత పెళ్ళి చేసుకుంది. కొన్ని కారణాలచేత ఆ పెళ్ళి విఫలమై వంటరిగా మిగిలింది. రిటైర్మెంట్ తీసుకున్నాక 'సంధ్యారామం' అనే పేరుతో ఈ వోల్డేజి హోమ్ పెట్టింది. ఎవరెవరో అపరిచితులు వచ్చి చేరారు. ఒక్కొక్కరూ ఒక్కొక్క ప్రపంచం. ఎవరి అనుభవాలూ అనుభూతులూ వారివి. జీవనసంధ్యలో ఎదురైన యీ లేటు అనుభవం మాత్రం ఒకటే.

బాధ్యతల వెల్లువలో తన అస్థిత్వాన్ని కోల్పోయిన లలిత అవన్నీ తీరిపోయిక అందరికీ ప్రశ్నార్థకమై వచ్చి, కమల దగ్గర చేరింది. అదీ ముందురాత్రి. చేతిలో చిన్న సూట్‌కేస్‌తో రాత్రి పదకొండు గంటలవేళ వంటరిగా వచ్చి సంధ్యారామం తలుపు తట్టింది. తలుపు తీసిన కమల స్థాణువైంది. ఆమె యింకా తేరుకోకముందే తనే చెప్పేసింది. "ఇకపై యిక్కడే వుంటాను" అని. మనిషి నిలువునా దుఃఖంతో వూగిపోతోంది. కదిలిస్తే చాలు విరుచుకుపడే కడలి కెరటంలా వుంది. అంతటి వుద్వేగాన్ని తట్టుకునే శక్తి కమలకి లేదు.

"రాత్రి... బాగా పొద్దుపోయింది. పద, పడుకుందాం. పొద్దున్న లేచాక అన్నీ మాట్లాడుకోవచ్చు" అని భుజాలచుట్టూ చెయ్యేసి తన గదిలోకి తీసుకెళ్ళింది. పక్కవేసి పడుకోమంది. మానసికంగా చాలా అలసిపోయిందేమో లలిత, ఆపాటి ఆదరణకే సేదదీరి నిద్రలోకి జారుకుంది. కమలకి మాత్రం ఆ రాత్రి మరింక నిద్రపట్టలేదు.

తనకో యిల్లూ పిల్లలూ సంసారంలేవని యిన్నాళ్ళూ వెల్తిపడేది. అంతర్గతంగా దుఃఖించేది. ఎవరూలేని ఏకాంతంలో, తన చెయ్యొదిలేసి వెళ్ళిపోయిన భర్తని తలుచుకుని ఏడ్చేది. అలాంటిది యిప్పుడా బంధాలన్నీ పరిహసిస్తున్నట్టుగా వుంది లలిత యిక్కడికి రావటం.

మర్నాడు పగలంతా ఏవో పనులు... సాయంత్రానికిగానీ లలితతో మాట్లాడడానికి తీరలేదు.

'మూర్తితో ఏంటి గొడవ? పదేళ్ళుగా వాడిదగ్గరే వుంటున్నావుగా?" అడిగింది కమల తనే మళ్ళీ ఏ జవాబూ రాకపోవటంతో.

"ఇన్నాళ్ళూ అంటే వాడిపిల్లలు చిన్నవాళ్ళు. భార్యాభర్తలిద్దరూ వుద్యోగాలకి వెళ్తారుగాబట్టి ఓ మనిషి అవసరం వుండి, నన్ను దగ్గరుంచుకున్నారు. ఇప్పుడు వాళ్ళ పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. నా వునికి కిట్టడంలేదు" అంది లలిత.

"మూర్తిక్కూడానా?" కమల ఆశ్చర్యపోయింది.

ఆమెకి లలిత నలుగురు పిల్లల గురించీ బాగా తెలుసు. పెద్దవాడు మూర్తి సాత్వికుడు. చిన్నవాడు రమణది దుడుకు స్వభావం. పెద్దకూతురు హేమది గట్టి వ్యక్తిత్వమే అయినా మృదుస్వభావం దాన్ని నివురులా కప్పి వుంచుతుంది. అందుకే ఆమె ఉమ్మడి కుటుంబంలో

నెగ్గుకురాగల్గుతోంది. చిన్నది స్వర్ణలో కొంత స్వార్థం వుంది. ఇవన్నీ వాళ్ళతో తనకున్న పరిచయాన్నిబట్టి కమల వేసుకున్న అంచనాలు. నది ఒడ్డున నిలబడ్తే అంతా నిశ్చలంగా కనిపిస్తుంది. దిగితేగానీ లోతు తెలీదు. కమల ఒడ్డుని నిలబడి లోతుపాతులు అంచనా వేస్తోంది. లలిత ప్రవాహంలో వుంది.

"మూర్తిని పిలిపించి నేను మాట్లాడనా?" అడిగింది కమల. "నిన్నిక్కడిలా చూస్తుంటే నాకు గుండె తరుక్కుపోతోంది. ఏదో... నాలా తాడూబొంగరం లేనివాళ్ళు చేరటం కోసమని యీ హోమ్ పెట్టాను గానీ..." పూర్తి చెయ్యకుండా ఆపేసింది.

లలిత నిర్వేదంగా నవ్వింది. ఆమెకి మనసులో వుంది, తనవైపు ఎవరైనా వకాల్తా తీసుకుని కొంత మందిని నిలదీయాలని 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అన్న మనువు దగ్గిర్నుంచీ 'నీదారి నువ్వు చూసుకొమ్మని' వదిలేసిన మూర్తిదాకా, అందర్నీ.

★★★

సంధ్యారామం గేటు తీసుకుని లోపలికి అడుగుపెడ్తుంటే అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది మూర్తికి. అక్కడికి రావటం అతనికది మొదటిసారికాదు. కమలకోసం ఎన్నోసార్లొచ్చాడు. కానీ యిప్పుడు రావటంవేరు. ఐతే తల్లి యిక్కడికొచ్చి వున్నందుకు బాధగానీ, అందుకు తను బాధ్యుడన్న అపరాధభావంగానీ లేవు.

"హలో బ్రూటస్" గేటుదాటి కాస్త నడిచాడో లేదో కమల గొంతు వినిపించింది.

"నన్నేనా ఆంటీ?" అటుగా నడుస్తూ భుజాలకుదింపుతో అడిగాడు.

"నిన్నుకాక?" కమల అడిగింది.

"అమ్మ యిక్కడికొచ్చిందని మీకు కోపంగా వుందికదూ?" ఆమెతోపాటు నడుస్తూ అడిగాడు.

కమల జవాబివ్వలేదు. ఇద్దరూ నిశ్శబ్దంగా ఆఫీసు రూమ్‌కేసి దారితీశారు. లలిత అక్కడేవుంది. మూర్తిని చూడగానే కోపంగా వెళ్ళిపోయింది.

"అమ్మకింకా కోపం తగ్గలేదు" అన్నాడు మూర్తి.

"ఇంత సన్మానం జరిగాక కూడానా?" వ్యంగ్యంగా అంది కమల.

"నువ్వొకవైపే ఆలోచిస్తున్నావాంటీ" మూర్తి ఆరోపించాడు.

"నేను జడ్జినికాదు, తప్పొప్పులు నిర్ణయించడానికి. లలిత నా ఫ్రెండ్. దాని తరపున నేనడుగుతున్నాను. కన్నతల్లి నీకు బరువైందా మూర్తీ? మీరు పెద్దవాళ్ళైపోయారు. మీ అంతటివాళ్ళు మీరయారు. మేం చెప్పేవీ చేసేవీ మీకు నచ్చవు.. కానీ ఒరే మూర్తీ! చిన్నప్పట్నుంచీ మా మధ్యనున్న అనుబంధం చేత తటస్థంగా వుండలేక అడుగుతున్నాను. చెప్పు.... ఈ వయసులో అమ్మ నీకు బరువైందా?" ఆవేదనగా అడిగింది.

"అమ్మ బరువెందుకౌతుందాంటీ? కర్మభూమి మనది. ఏ పనిచేసినా పాపపుణ్యాల లెక్కలు సరిచూసుకునే మనుషులంమనం"

"మరేంట్రా సమస్య. కోడళ్ళని రాచిరంపాన పెట్టే మనస్తత్వం కాదు దానిది"

"సమస్య అమ్మపరంగా వచ్చింది కాదు. సుమతికి ఫార్టీ దగ్గిరపడ్డాయి. బాధ్యతలు పెరిగాయి. ఇంటాబైటా వత్తిళ్ళు పెరిగాయి. ఏవో హెల్త్ ప్రాబ్లమ్స్ కూడా మొదలయ్యాయి. ఇదివరకట్లా అమ్మ చాదస్తాన్ని భరించలేకపోతోంది. నిత్యం యింట్లో ఏదో ఒక గొడవ."

"అందుకని అమ్మనింట్లోంచే వెళ్ళగొట్టావా?"

"లేకపోతే సుమతిని వెళ్ళగొట్టాలి. పెళ్ళి పేరుతో మేమిద్దరం ఎత్తుకున్న ఉమ్మడి బాధ్యతలు

పిల్లలు. వాళ్ళకింకా వుద్యోగాలూ పెళ్ళిళ్ళూ లేవుగాబట్టి అవయ్యేదాకా మేం కలిసుండటం తప్పనిసరి".

"ఎంత షేమ్‌లెస్‌గా మాట్లాడుతున్నావు? తప్పు యిద్దర్లో ఎవరిదేనా కావచ్చు. మగవాడివి, నువ్వు సర్దిచెప్పలేవా?"

"ఏమిటి సర్దిచెప్పాలి? ఎంతకని సర్దిచెప్పాలి? నాన్నగారు పోయాక అమ్మని నా దగ్గిర తెచ్చిపెట్టుకుని కంటికి రెప్పలా చూసుకున్నాను. తమ్ముడు ఆవిడని తీసుకెళ్ళలేదనిగానీ, ఆవిడకోసం డబ్బు పంపలేదనిగానీ ఎప్పుడూ వంతుపోలేదే? ఆవిడ రాకతో ఒక విధంగా మా ప్రైవసీని కోల్పోయాం. ఐనా సుమతి ఏమీ అనలేదే?"

"తల్లిదండ్రుల గురించి అలా అనుకుంటే ఎలారా?"

"వాళ్ళవైపునుంచి కూడా కొంత కోపరేషనుండాలి. ఇల్లు నడపాల్సింది గృహిణికానీ గృహస్థు తల్లి కాదనే విషయం తెలుసుకోవాలి. ప్రతిదాంట్లోనూ అత్తాకోడళ్ళిద్దరి మధ్యా యిగో క్లాషెస్. అవీ యీ మధ్యనే పిల్లలు పెద్దవాళ్ళయ్యాక మొదలయ్యాయి. అమ్మకి అన్నీ ఆరా కావాలి. ప్రతీదీ తనకి చెప్పిచెయ్యాలంటుంది. లేకపోతే సగుణతుంది, గొణుగుతుంది."

"ఏదోలేరా! దాన్దో చాదస్తం"

"నీకు రాలేదేం ఆ చాదస్తం?"

మూర్తి ప్రశ్నతో తెల్లబోయింది కమల. నిజమే. లలిత వయసే తనకీ వుంటుంది. తనకే చాదస్తం లేదేంటి? ప్రతిపనీ సిస్టమేటిగ్గా చేసుకుంటోంది యిప్పటికీ కూడా.

"ఆంటీ! జవాబు నేను చెప్తాను. అమ్మకి చేతినిండా వ్యాపకంలేదు" అన్నాడు మూర్తి క్లుప్తంగా. దాన్ని యథాతథంగా వప్పుకోలేకపోయింది కమల.

"మరి రమణకేమైందిరా? వాడో కొద్దిరోజులు తీసుకెళ్ళవచ్చు కదా? అందరూ వుండిదాన్ని దిక్కులేనిదాన్లా వదిలేశారు" అంది.

"నువ్వు వాడితో మాట్లాడతావా?"

"ఏం నువ్వు మాట్లాడటం అయిపోయిందా!"

దానికి జవాబు చెప్పకుండా రమణ నెంబరిచ్చి లేచాడు మూర్తి వెళ్ళేముందు ఒక్కనిముషం ఆగి జేబులోనుంచి చెక్కుబుక్కు తీసి సంతకం చేసి చెక్కు యిచ్చాడు. దాని మీద పదివేలు వేసి వుంది.

"మూర్తీ" తెల్లబోయింది కమల.

"మా తరానికిలాగే మీ తరానికి కూడా అవసరాలు మారాయి. అమ్మకి కావల్సింది తిండీ, బట్టా, ఆశ్రయం ఒక్కటేకాదు. కాలక్షేపం - ఒక వ్యాపకం కావాలి. ఆవిడ సమస్య యిదే. దానికి పరిష్కారం యెక్కడ దొరుకుతుందేమోనని..." అన్నాడు.

"ఐతే మాత్రం? ఈ డబ్బెందుకు? వద్దు. తనకి తెలిస్తే బాధపడ్తుంది" తిరిగి యిచ్చేసింది కమల. మూర్తి కొంచెం తటపటాయించి తిరిగి తీసుకుని "వస్తా ఆంటీ" అని వెళ్ళిపోయాడు.

అతని ధోరణిబట్టి చూస్తే రమణక్కూడా తల్లిని వుంచుకునే ఉద్దేశ్యం లేనట్టే అనిపించింది. ఐనా మూర్తి యిచ్చిన నెంబరు కలిపింది. రమణే ఎత్తాడు.

"రమణా! అమ్మ యిప్పుడు నా దగ్గిరకొచ్చి వుంటోంది. తను సంతోషంగా వచ్చి యిక్కడుంటే ఏ బాధాలేదు. మూర్తింట్లో పోట్లాట పెట్టుకుని వాళ్ళు కాదనుకుంటే యిక్కడికొచ్చింది" అంది కమల.

"ఆంటీ! నేనో ప్రశ్నడుగుతానుచెప్తావా?"

రమణ ప్రశ్నకి తెల్లబోయింది కమల. "ఏమిటది?"

"ఆవిడ బాధ్యత మా యిద్దరిదేనా?"

"అంటే చెల్లెళ్ళని కూడా పంచుకోమంటావా?" అసహ్యంలాంటి భావమేదోపుడుతూ వుంటే దాన్ని అణుచుకుంటూ అడిగింది.

"వాళ్ళిద్దరి సంగతీ తర్వాత. మా చిన్నాన్న గురించి నేనంటున్నది. మా నాన్న బతికున్న రోజుల్లో ఆయనని చదివించారు. అత్తయ్యలకి పెళ్ళిచేశారు. నాన్న అలా చెయ్యటం వాళ్ళ హక్కుగా భావించారు. మరి బాధ్యతలో?"

"హక్కులూ, బాధ్యతలూ తర్వాత. మధ్యలో నలిగిపోతున్నది మీ అమ్మ"

"ఆవిడే మరి... తన యిల్లంతా దోచి వాళ్ళకి పెడ్తుంటే మాట్లాడక వూరుకుంది. నాదాకా వచ్చేసరికి ఖాళీ చెయ్యి చూపించారు. మా మామయ్య నా మీద దయదల్చి ఐటిఐ చెప్పించి మెకానిక్ ఉద్యోగం యిప్పించాడు"

"తప్పంతా మీ నాన్నది. ఆయన్నే అడగాల్సింది"

"నీకప్పటి సంగతులు తెలీవులే. అలా ఎదురుతిరిగాననే నాన్న చావగొడ్తే మా మామయ్య దగ్గరకి పారిపోయాను"

ఈ గొడవంతా కమలకి తెలీదు. రమణ మేనమామ దగ్గరుండి చదువుకున్నాడనే ఆమెకి చెప్పింది లలిత. "పోనీలేరా జరిగిందేదో జరిగిపోయింది. నీకు మీ మామయ్య చదువు చెప్పించినట్లే మీ నాన్న తన వాళ్ళకి చెప్పించుకున్నాడు. అమ్మని నువ్వో నాలుగు రోజులు తీసుకెళ్తే మార్పుగా వుంటుంది" అంది నచ్చచెప్తున్నట్టు.

"సారీ ఆంటీ! నా భార్యొప్పుకోదు. మాది యింటర్‌కేస్ట్ మేరేజని తనని ఎన్నెన్ని మాటలన్నారో అన్నవాళ్ళు మర్చిపోయినా పడ్డవాళ్ళు మర్చిపోరుగా" అనేశాడు. ఆ పైన ఫోన్ పెట్టేసిన చప్పుడు.

హతాశురాలైంది కమల. ఏదో అసంతృప్తి. ఎందుకు? ఎందుకిలా జరుగుతోంది?

పెళ్ళి చేసుకోవడం భార్యాభర్తలకి సరిపడకపోవడం, పిల్లల్ని కనటం, పెద్దవాళ్ళతో వాళ్ళకి పడకపోవటం...

మనదెంతో వుత్కృష్టమైన కల్చరనీ, కుటుంబ వ్యవస్థని మనమే పరిరక్షిస్తున్నామనీ ప్రపంచమంతా వినేలా డబ్బా కొట్టుకుంటాం. అందులో యిన్ని లుకలుకలు.

రమణని తీసుకెళ్ళి మేనమామ చదువదీ చెప్పించి తన కుంటి కూతుర్నిచ్చి చేద్దామనుకున్నాడు. రమణ ఆయన దగ్గిర్నుంచి గొడవపడి వెళ్ళిపోయాడు. ఏదో షెడ్డులో మెకానిగ్గా చేరి యింటర్‌కేస్ట్ మేరేజి చేసుకున్నాడు. ఆ పెళ్ళికి యింట్లోంచి శవం కదిలివెళ్ళినంత గొడవ చేశారు లలిత, భర్తాను. అలాంటి పేరెంట్స్‌ని ఏ కొడుకులు మాత్రం గౌరవిస్తారు? మూర్తి దగ్గిరే యిమడలేకపోయిన లలిత యింకొకరిదగ్గిర ఎలా వుంటుంది?

***

లలిత పెద్దకూతురు హేమ తల్లిని చూడటానికొచ్చింది. ఆమెని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"మూర్తి యిలా చేస్తాడనుకోలేదు. వాడిననని ఏం లాభం? వదినకి మొదట్నుంచీ వాళ్ళవైపే తప్పించి మనవైపు ఎవరూ పనికొచ్చేవారు కాదు. అమ్మని తీసుకెళ్ళి వుంచుకోవటం మూర్తి బలవంతంమీదే. ఇన్నాళ్ళకి ఆ కసంతా యిలా తీర్చుకుంది" అంది తప్పంతా సుమతిది చేసి.

కమలకి ఆశ్చర్యం వేసింది.

"ఇప్పటికీ మాది వుమ్మడి కుటుంబమే. మావారుగానీ మా బావగారుగానీ తల్లిమాట జవదాటరు. ఆవిడేం చెప్తే అది జరగాల్సిందే" అంది.

"మీ అత్తగారికేమే? ఇనప్పెట్టెలాంటియిల్లు ఆవిడపేర్న పెట్టి చచ్చిపోయాడు మీ మామగారు. ఆవిడని మంచి చేసుకోకపోతే ఏ కూతురికో రాసేస్తుంది" అంది లలిత.

కమల యింకా ఆశ్చర్యపోయింది. ఇనప్పెట్టెలాంటి యిల్లో, వంటినిండా బంగారమో లేకపోవడమే లలిత సమస్యా? అవన్నీ వుండికూడా ఆశ్రమాల్లో వుంటున్న వాళ్ళ మాటో? అగమ్యగోచరంగా అనిపించింది.

చాలాసేపు కూర్చుని వెళ్ళింది హేమ. ఉన్నంతసేపూ సుమతి గురించే చెప్పుకున్నారు. పదేళ్ళు తనని దగ్గిరపెట్టుకుని పోషించిన స్త్రీపట్ల కొడుకునిబట్టేనా లలితకి ప్రేమనేది లేకపోవడం, ఆమెకి ఆశ్చర్యంగా అనిపించింది.

...

స్వర్ణ చూడ్డానికొస్తూనే తల్లిని కోప్పడింది. "అన్నయ్యా వదినా నిన్ను నెత్తిన పెట్టుకుని చూస్తుంటే కాదనుకుని యిక్కడికొచ్చి వున్నావు. బావుందా యిక్కడ? వాళ్ళేనా నిన్నేమన్నారని? అన్నిట్లోనూ తలదూర్చక ఓ వార కూర్చోమన్నారు. నీ కాలక్షేపం నిన్ను చేసుకోమన్నారు. నీ చాదస్తాన్ని వాళ్ళు మాత్రం ఎంతకని భరిస్తారు? అక్కడికీ వదినకి నోరులేదు కాబట్టి నువ్వేం చేసినా వూరుకుంది" అంది.

రంగస్థలం మీద నటులు మారుతున్నట్టు ఒక్కొక్కరూ వస్తున్నారు. తమ పాత్రల్ని పోషిస్తున్నారు. సంభాషణలు చెప్తున్నారు. వెళ్తున్నారు. ఇంకా తెరమీదిపాత్ర పోషించనిది లలితొక్కర్తే. కమల కేవలం ప్రేక్షకులరాలైపోయింది.

"గొడవలు ఎన్నేనా వుండవచ్చు స్వర్ణా! అర్ధరాత్రివేళ యిల్లొదిలి వచ్చేసిందంటే దాని మనసెంత గాయపడి వుంటుందో" అంది అక్కడికీ వూరుకోలేక.

"నీకు తెలీదాంటీ, ఈ పెద్దవాళ్ళ చాదస్తాలు. మా అత్తగారుందా, కాల్చుకుతింటుంది. ఏపనీ ఓ పట్టాన తెమల్చదు. అన్నీ పద్ధతిప్రకారం చెయ్యాలంటుంది. ఆవిడొచ్చిందంటే మేం ఒకపూట మాడాల్సిందే. మహానైవేద్యం అయితేగానీ తిండిపెట్టదు. అదయ్యేసరికి పదకొండో పన్నెండో! పండగొచ్చిందంటే చాలు, చచ్చేచావు. సెలవొచ్చిందని నేను సంతోషపడ్తాను. ఆవిడేమో బూజులు దులిపించీ, గదులు కడిగించీ సందడంతా వలకబోస్తుంది. కోడలనగానే వీళ్ళకెలా కనిపిస్తుందో! అందుకే మా దగ్గరకొచ్చి వుంటానంటే వద్దన్నాను" రుపీమని అంది.

"పోనీ అమ్మని నువ్వోకొన్నాళ్ళు తీసుకెళ్ళు. నువ్వు జాబ్ హోల్డర్‌వేగాబట్టి ఎలా వుండాలో దానికి నేర్పించవే. నీకైతే స్వతంత్రం వుంటుంది అమ్మగనుక."

"ఆ నాకిదేపని. ఈవిణ్ణి తీసుకెళ్తే అవిణ్ణి తీసుకొచ్చుకోవడం నాకు పెద్ద ఆబ్లిగేషనైపోతుంది. అదీగాక ఆయన తనవాళ్ళకీ నేను నా వాళ్ళకీ పెట్టుకుంటూపోతే మా పిల్లలకి మిగిలేదేంటి?"

"ఒక్క మనిషి..."

"ఒక్క మనిషి కాదు. ఒక వ్యవస్థ. ఈవిడకున్నంత బంధుప్రీతి ఎవరికీలేదు. వదినగాబట్టి యిన్నాళ్ళు భరించింది".

"బావుందే! ఇల్లన్నాక బంధువులురారా? మనమేం సమాజంలో వుంటున్న వాళ్ళమా లేక వెలిపడ్డామా?" లలిత కలగజేసుకుని కోపంగా అడిగింది.

"ఎవరమ్మా ఆ బంధువులు? బాబాయికీ అత్తయ్యలకీ నాన్న అంత చేశారే! ఒక్కరైనా వచ్చి నిన్నెప్పుడేనా పలకరించారా? ఇంకా నువ్వేదో పెట్టడంలేదనీ, మూర్తి చేత

పెట్టించడంలేదనీ కోపం వాళ్ళకి. ఇంక నా పెళ్ళికి... పదివేలు తక్కువపడ్తే అప్పుగా సర్దమని యీ బంధువులందర్నీ పేరు పేర్నా బతిమాలారు నాన్న. ఆఖరికి పెళ్ళాగిపోయే పరిస్థితి వస్తే రమణకి తెలిసి ఆ డబ్బు పంపాడు. వీళ్ళందరినీ కూర్చుబెట్టి వదిన చేత చేయిస్తున్నావు. ఇందులో వెయ్యోవంతు ప్రేమ నీకు కోడళ్ళమీదుంటే ఎంతో సంతోషంగా వుండేదానివి" అంది స్వర్ణ బాధగా.

"అనండి! అనండి. మీ అందరూ మంచి వాళ్ళే. నేనొక్కదాన్నే చెడ్డదాన్ని. అందర్నీ కష్టపెడ్తున్నాను. ఉద్యోగం చేస్తోందని దీనిఅడుగులకి మడుగులొత్తలేదని మూర్తికి కోపం. కులాంతరం చేసుకున్నాడు, దాన్ని నెత్తికెక్కించుకోలేదని రమణక్కోపం. ఆ విషయం దాచిపెడ్తేనే కదా, నీ పెళ్ళైంది. లేకపోతే మీ అత్తగారు వప్పుకునేదా? అసలే నిప్పులుకడిగే ఆచారం గల మనుషులు".

"వాళ్ళు కాకపోతే యింకొకళ్ళు... రమణా, భార్యా పనికిరాలేదుగానీ వాళ్ళిచ్చిన డబ్బు పనికొచ్చిందేం?"

"ఔనే! నేను చెడ్డదాన్ని. స్వార్థపరురాల్ని. అందుకే అందర్తో దెబ్బలాడి యిక్కడొచ్చి వుంటున్నాను. ఇక్కణ్ణుంచీ కూడా పొమ్మంటే పోతాను. నన్ను చూడడానికి మీరెవరూ రావద్దు. నా బరువు మీరెవరూ మోయద్దు. నేను పోయాక కూడా" విసురుగా అంది లలిత.

స్వర్ణ కోపంగా వెళ్ళిపోయింది.

కమల వుక్కిరిబిక్కిరైంది. రమణ... తల్లి బాధ్యత తనది కాదని చెప్పేసిన రమణ... స్వర్ణ పెళ్ళికని పదివేలు సర్దాడా? అప్పుడంత గొడవచేసి వీళ్ళా డబ్బెలా తీసుకున్నారు? తనని అడిగితే యిచ్చేదికదా? ఏమిటీ మమతలకీ అభిమాన పౌరుషాలకీ అరర్థం? సమాజం ఏ దిశగా ప్రయాణిస్తోంది?

భూస్వాములమీద రైతులూ, కూలీలూ తిరగబడ్డారు.

పెద్దవాళ్ళమీద పిల్లలు తిరగబడ్తున్నారు.

ఎక్కడ నిరంకుశత్వం వుందో అక్కడ తిరుగుబాటు జరుగుతోంది. వ్యక్తిత్వాన్ని పరిరక్షించుకోవడం కోసం మనుషులు వుద్యమిస్తున్నారు. అదో వెల్లువలా కాక చాపకింద నీరులా సాగుతోంది. మరి మానవసంబంధాలేమౌతాయి? ఒకరికొకరు ఏమీ కానప్పుడు మనిషికంటూ మిగిలిందేమిటి? తనకీ లలితకీ మధ్యనున్నదేమిటి?... తనకీ లలితకీ మధ్య హద్దులు దాటని ప్రేమ, అవధుల్లేని స్నేహం... ఔను మనిషికి కావల్సినవి యివే. ఆమెకి తనని ముంచెత్తుతున్న వెల్లువేదో తొలగిపోయినట్లైయింది. తేలిగ్గా నిశ్వసించి తన భావాలని లలితతో పంచుకుందామనుకునేసరికి ఆమె అక్కడలేదు.

★★★

మూర్తి పెద్దకొడుకు హేమంత్ వచ్చాడు నాయనమ్మని చూడటానికి. మూర్తికిద్దరు పిల్లలు. హేమంత్ తండ్రిలా వుంటాడు. మగపిల్లాడు గాబట్టి లలితకి చాలా యిష్టం. రేష్మది సుమతి పోలిక. ఆ పిల్లతో ఆమెకి ఎటాచ్‌మెంట్ తక్కువ.

హేమంత్‌ది యింటరైపోయింది. బీటెక్ కౌన్సిలింగ్ కోసం చూస్తున్నాడు.

"నమస్తే ఆంటీ" అని కమలని విష్ చేశాడు.

"నువ్విక్కడుండటమేమిటి బామ్మా? ఇంటికెళ్దాంపద" అన్నాడు అభిమానంగా.

"నేను రానురా" కోపంగా చెప్పింది లలిత.

నవ్వేడా అబ్బాయి. ఆ నవ్వు మూర్తి భావాలని దొంగిలించి రహస్యంగా చూపిస్తున్నట్టుంది.

"సర్లే, రావద్దు. ఇక్కడే వుండు. బావుందా నీకిక్కడ?" ఆమె పక్కనే కూర్చుని ప్రేమగా అడిగాడు. ఇద్దరూ నెమ్మదిగా కబుర్లలో పడ్డారు.

లలిత చాలా ఆరాలడిగింది. పనిమనిషి మళ్ళీ వస్తోందా! మీ నాన్నే వాషింగ్‌మెషిన్ పెడుతున్నాడా? బట్టలెవరు యిస్త్రీ చేస్తున్నారు? మీ అమ్మమ్మ వచ్చిందా? ఎన్నో ప్రశ్నలు. అన్నిటికీ డిప్లమాటిగ్గా నవ్వేసి వూరుకున్నాడు హేమంత్.

"వాళ్ళ బెడ్రూమ్ అఫేర్స్‌మీద కూడా ఓ కన్నేసి వుంచుతావా?" అతను వెళ్ళిపోయాక దిగ్భ్రాంతిగా అడిగింది కమల. "వాళ్ళిద్దరూ భార్యాభర్తలు. ఇద్దరిమధ్యనీ సవాలక్ష వుంటాయి. ఆ పిల్ల తను చేసుకోలేని పనులు మూర్తికి చెప్తోందేమో! తల్లిని పిలిపించుకుంటోందేమో! తటస్థంగా చూసీ చూడనట్టు వూరుకోవాలిగానీ తల దూరుస్తారా? ఐనా హేమంత్ ఎవరని వాడిని ఆరాలడుతున్నావు? తల్లిమీద నీకు నేరాలు చెప్తాడా?" అని కోప్పడింది.

"వాడు చిన్నప్పట్నుంచీ నాకు చేరిక. తల్లేం చేసినా పూస గుచ్చినట్టు చెప్పేసేవాడు." గొప్పగా అంది లలిత.

"ఛ... తప్పుకాదు? సుమతికి తెలిస్తే ఎంత బాధపడుతుంది?"

"నీకు తెలీదులేవే! ఉద్యోగం చేస్తున్నానని దానికెంత గర్వమో! మగవాళ్ళు యింటిపనులు చెయ్యటం ఎక్కడేనా చూశావా? మా వారు ప్రాణం పోతున్నా ఎప్పుడూ గ్లాసుడు మంచినీళ్ళందించలేదు. అలాంటిది అర్ధరాత్రి దాహం వేస్తోందని మూర్తిచేత నీళ్ళు తెప్పించుకు తాగేసి మళ్ళీ గ్లాసందించేస్తుంది. నా కళ్ళతో నేను ఎన్నోసార్లు చూశాను, వాడు మంచినీళ్ళు తీసుకెళ్ళి యివ్వటం. పనిమనిషి రాకపోతే వాడిచేత వాషింగ్‌మెషిన్ పెట్టిస్తుంది. ఇంకా యిలాంటివెన్నో" అంది లలిత.

"రోజులు మారాయి లలితా! మనప్పుడు ఆడవాళ్ళకి వుద్యోగాల్లేవు. ఎనిమిదిగంటల కాలం చేతిలో వుండేది. ఎన్ని పనులు చేసినా యింకా ఎంతోకొంత మిగిలేది. పైగా చాకలీ, పనిమనిషీ, స్కావెంజరూ... ఏ పనికాపనికి మనుషులుండేవారు. పిల్లలకి తల్లికిసాయం చెయ్యటానికి వ్యవధి వుండేది. ఇప్పుడు యీ వత్తిడి అంతా ఆడదాని మీదే పడ్తోంది. ఎన్నని చేస్తుంది? యంత్రం కాదుగా? అందుకని భర్తతో పంచుకుంటోంది. ఏదో ఒకలా యీ బతుకు రధాన్ని యీడ్చటమే పెద్ద బాధ్యతైపోయింది. వాళ్ళ గోలేదో వాళ్ళని పడనీ, నీకెందుకు?" నచ్చచెప్తున్నట్టు అంది.

"మరి నా పెద్దరికం ఎక్కడేడ్చింది?"

"మూర్తి అన్నట్టు నువ్వో వ్యాపకం కల్పించుకోవే. వాళ్ళేం చేస్తున్నారో, వీళ్ళేం చేస్తున్నారో అనే విషయాలమీద ఆసక్తి పోతుంది. మూర్తి దగ్గర నువ్వేదో హాయిగా వున్నావని యిన్నాళ్ళూ అనుకుంటూ వచ్చాను"

"పోవే! మొగుడూ మొద్దులూ లేకుండా వంటపిల్ల రాకాసిలా బతుకుతున్నావు. నీకీ బాధ అర్ధంకాదులే" విసుగ్గా అనేసి అక్కడి నుంచి వెళ్ళిపోయింది లిత.

కమ్చీ దెబ్బతిన్నట్టయింది కమలకి. గుండెల్లో చివ్వుమని బాధ ఎగిసింది. లలిత... ఎంతమాటంది తనని! దిగ్భ్రాంతిగా అలాగే కూర్చుండిపోయింది. ఆమెపట్ల అప్పటిదాకా వున్న ప్రేమంతా యిగిరి ఆవిరైపోయి మిగిలిందంతా డ్రెగా కనిపించింది. నిజమే! తనకేం తెలుసని వాళ్ళ వ్యవహారాల్లో కలగజేసుకుంటోంది తను. బతుకు బండిలో ఎన్నో పండుటాకులు కొట్టుకొచ్చి తన ముంగిట్లో రాల్తాయి. అందులో లలిత కూడా అనుకోబోయింది గానీ గుండెలో కలుక్కుమంది. అస్మదీయ భావన...కొన్నిటిని కావాలనిపించేదీ... పూనుకుని కొందరికి

రక్షణనిచ్చేదీ... అనవసరమైన బాధ్యతల్ని పెంచేదీ యిదే! సుదీర్ఘంగా నిశ్వసించింది. దాన్నెలాగేనా జయించాలనుకుంది.

చాలాసేపటికి భుజంమీద చల్లటి చెయ్యిపడ్డే వులిక్కిపడింది. తలతిప్పి చూస్తే లలిత. ఏడ్చినట్టుంది. కళ్ళు ఎర్రగా వున్నాయి. "ఇప్పుడేమైందని?" అప్రయత్నంగా అంది కమల.

సంజాయిషీ యిస్తున్నట్టు నెమ్మదిగా అంది లలిత, "నా మనసెందుకో యిలాగే అశాంతంగా వుంటుంది. అందర్నీ నొప్పించాలనిపిస్తుంటుంది. నేను కొంతమందికి మంచిదాన్ని కావచ్చు. ఇంకొందరికి చెడ్డదాన్ని కావచ్చు. కొన్ని విషయాల్లో మంచి గానూ, యింకొన్నింట చెడ్డగానూ వుండచ్చు నాక్కొన్ని అభిప్రాయాలున్నాయి. వాటిని ప్రకటించుకునే వేదికలేదు. ఏ కోడలిమీదా నాకు పెద్దగా ప్రేమాభిమానాలు లేవు. కారణం రక్తస్పర్శలేకపోవటమో, సాంప్రదాయికవైరమో అయ్యుంటుంది. ఐతే వీళ్ళిద్దరూ తమకి నచ్చిన రీతిలో తమ జీవితాల్ని గడుపుతున్నారు. నేను... నేను మాత్రం పెళ్లయ్యేదాకా తండ్రి అభిరుచుల్నీ, తర్వాత భర్తవీ ఆ తర్వాత కొడుకు యిష్టాలనీ పాటిస్తున్నాను. అలాగని నాలో ఆలోచనాశక్తి చావలేదు. నిరంతరం సంఘర్షణ. ఎందుకు? ఎందుకని యీ అణచివేత? ఎందుకని యీ అస్వతంత్రం?" క్రమంగా లలిత గొంతులో ఆవేశం పెరిగింది. అది ఆవేదనగా రూపుదిద్దుకుంటోంది. కమల విస్మయంగా వింది.

"నాకిప్పుడింకా అరవయ్యేళ్ళే. వొంట్లో వోపికుంది. ఏదో చెయ్యాలన్న తపన వుంది. చెయ్యటానికి యింట్లో ఏ పనీ కనిపించదు. వేళకి అన్నీ తను చేసుకుని వెళ్ళిపోతుంది. నాకు చెప్పాలంటే తనకి మొహమాటం. ఏమైనా అనుకుంటానని భయం. అందుకని తను చెయ్యలేనివి మూర్తికి చెప్తుంది. మూర్తేనా నాకు చెప్పచ్చు. వాడూ చెప్పడు. తనే చేస్తాడు. అంటే వాళ్ళిద్దరూ ఒకటి... నేను వేరు... నాలో అసహనానికి అదే నాంది".

"ఛ... అదేంటి?"

"వాళ్లకలా వుండకపోవచ్చు కానీ నాకలానే అనిపిస్తుంది. ఏల నన్ను మనసారా ఏడ్వనీరు? అని కృష్ణశాస్త్రి అన్నట్టు ఒక్కోసారి గుండె బరువెక్కి ఏడవాలనిపిస్తుంది. ఇంట్లో అంతా కంగారుపడ్తారు"

"ప్రేమతోటేగా?"

నిర్వేదంగా నవ్వింది లలిత "ఈ ప్రేమ కోసమని ఎన్ని భావాలని చంపుకుంటాం? కాల్లో ముల్లు గుచ్చుకుటుంది. బాధమనది. ఒక్కసారి దాన్ని గుండెనిండా ఆస్వాదిస్తే అనుభూతి చచ్చిపోయి అనుభవం ఒక్కటే మిగుల్తుంది. అలా కాకుండా చుట్టూ అందరూ వుండి ఓదారుస్తుంటే అనుభవంగా మారకుండా బాధ అక్కడే గడ్డ కట్టుకుపోయి యింకా బాధిస్తుంది. ఈ ప్రేమాదరణలని సంతోషంగా స్వీకరించే వయసు దాటిపోయింది నాకు. అన్నీ కృత్రిమంగా అనిపించి అశాంతిగా వుంటోంది"

"..."

"పిల్లలు నవ్వుకునే విషయాలూ, సుమతి సరదాలూ, మూర్తికి దాని మురిపాలూ అన్నీ... వాళ్ళేం చేసినా చిరచిరగా అనిపిస్తుంది. నాలా నిర్వికారంగా వుండరెందుకు వీళ్ళు? అనుభవాలతో పండిపోయిన నన్ను చూసేనా ఎందుకు నేర్చుకోరు?"

"బావుంది! నీ వయసొస్తే అలాగే వుంటారేమో"

"అదే నేననేది. సంసారికులమధ్యవుంటూ ఏదీ పట్టనట్టు ఎలా వుండటం? నాకంటూ ఓ యిల్లుంటే అందులో నేనుంటే వీలు చిక్కినప్పుడు ఎప్పుడో ఒకసారి వచ్చి వెళ్ళేవారు. వీళ్ళ

సంసారాల్లో నాకు నచ్చని అంశాలు నన్ను బాధించేవి కావు"

"అదేంటే? ఈ వయసులో అంతా పిల్లల దగ్గిరికెళ్ళి ప్రశాంతంగా గడపాలనుకుంటారు"

"పిల్లల దగ్గర ప్రశాంతత..! ఎండమావుల్లో నీళ్ళు వెతుక్కోవటం"

చాలాసేపు యిద్దరూ మాట్లాడుకోలేదు. కమల ఆలోచిస్తోంది. లలిత చెప్పినదాంట్లో వాస్తవం వుంది. ప్రతివారికీ ఓ గూడంటూ వుండాలి. రెక్కలొచ్చి పిల్లలు ఎగిరిపోయాక, మధ్యలో వచ్చిన బరువులూ, బాధ్యతలూ, సరదా సంతోషాలూ, బాధలూ, యిబ్బందులూ తదితరాలన్నీ వాళ్ళతోటే వెళ్ళిపోగా మనకోసం మిగిలిన అనుభూతులకీ అనుభవాలకీ ఆవాసంలా మిగిలి వుండేది. సమిష్టి కుటుంబాలు అంతరించి, వ్యక్తిగత కుటుంబాలు వుధ్భవిస్తున్న ఈ రోజుల్లో కుటుంబ కష్టసుఖాల ఒరవడి ముందుతరం వాళ్లని యిముడ్చుకోదు. అక్కర్లేని చుట్టంలా పడుండాలి. అలా వుండలేక సంఘర్షణ. ముఖ్యంగా లలితలాంటి వితంతువులకి. అలాంటి మనస్తత్వం గల వాళ్ళకి.

తన తల్లి వుండేది. తొంభైయేళ్ళు బతికిందావిడ. ఇద్దరు కొడుకులూ నలుగురు కూతుళ్ళూ వున్నా ఎవరిదగ్గరకీ వచ్చి వుండలేదు. తాతలనాటి యింట్లో ఒక్కర్తీ వుండి వండుకుతినేది. రమ్మని ఎవరెంత బతిమాలినా మీ పద్ధతులకీ నా పద్ధతులకీ కలవదు. ఓపికున్నంతకాలం యిక్కడే వుంటాను. ఆ తర్వాతెలాగా తప్పదు. అని తిరస్కరించేది. చేతినిండా వ్యాపకం వుండటంచేతేమో, అనారోగ్యం ఆవిడజోలికి రాలేదు. కొంత అంతర్ముఖంగా వుండేదేమో చావుని ముందుగానేతెలుసుకోగలిగింది. ఇంక మూడు రోజులకి పోతుందనగా అందర్నీ రమ్మని రాసింది. ప్రశాంతంగా కన్నుమూసింది. ఆవిడ బతికుండగా ఎలాంటి తిరస్కారదూషణలనీ ఎదుర్కోలేదు. ఆవిడేం చేసినా గొప్పగానే అనిపించేది తమకి... దూరపుకొండలు నునుపుగా వున్నట్టా?

లలితకేసి నిశితంగా చూసింది. అప్పుడే తనూ ఆలోచనలోంచి తేరుకుంటున్నట్టుగా అందామె, "పెద్దదానివయ్యావు. కృష్ణారామా అంటూ ఓ వార కూర్చోకూడదా అంటారు అంతా. ఎంత పెద్దదాన్నని? ఎమ్మెస్ సుబ్బలక్ష్మిని నీకాపాటలెందుకు, పెద్దదానివయ్యావు, ఓ మూల కూర్చోమని ఎవరేనా అన్నారా? అలాగే ఇందిరాగాంధీని అనగలిగారా? వీళ్ళందరికంటే చిన్నదాన్నేగా?.... ఎందుకంటే వాళ్ళందరికీ తమవైన బతుకులూ, గమ్యాలూ వున్నాయి. నాకు అలాంటివేం అక్కర్లేదు. ఎక్కడో ఒకచోట ప్రశాంతంగా గడపడానికింత చోటుకావాలి. నా భర్త నా గురించి ఆలోచించలేదు. నా గురించి నేనాలోచించుకోవడం తప్పనిపించేది. రమణన్నట్టు పిల్లలకీ అన్యాయమే జరిగింది. నాకూను"

"మరైతే యిక్కడే వుంటావా?" అడిగింది కమల. "ఉండగలనా అని?" సందిగ్ధంగా అడిగింది లలిత.

"ఆశ్రమం బాధ్యతలు నేనొక్కదాన్నే నిర్వహించలేకపోతున్నాను. క్లర్కుకోసం ఎడ్వర్టైజు చేద్దామనుకుంటున్నాను. వాళ్ళకిచ్చే జీతం నువ్వే తీసుకో. ఒక కాటేజిలో వుండు. నీకు నచ్చినట్టుండు. సంఘర్షించకు. పిల్లలు చెడ్డవాళ్ళుకాదు. వేగంగా మారుతున్న విలువలు, తరాల అంతరం... అంతే! మనగురించి వాళ్ళూ అలాగే అనుకుంటారు. ఈ కోణంలోంచీ చూడు. వాళ్ళకీ నీకూ మధ్యనున్న సంబంధాలు పారదర్శకంగా అనిపిస్తాయి"

"అప్పుడింక అలాగే వుంటుందిలే" అని నవ్వింది లలిత. కమల తనూ నవ్వి, కాటేజి తాళాలు యిచ్చింది. తాళం తీసుకుని గదిలో అడుగుపెడ్తుంటే వెనకటి నిరాసక్తత స్థానంలో ఒక వుత్తేజంలాంటిది చోటు తనలో చేసుకోవడం గమనించింది లలిత. అన్నీ అయిపోయాయనుకుంటే బతుక్కి అర్థమే లేదు. ఎప్పటికప్పుడు ఏదో వుందనిపిస్తుంటేనే ఆసక్తి.